# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- విపక్షాలకు అవకాశం ఇస్తే అభివృద్ధి నిలిచిపోతది
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్



మానేరు డ్యాం సమీపంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 23: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో పదేళ్లలో జరిగిన అభివృద్ధి చూసి తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని, తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇచ్చారు. స్థానిక మానేరు డ్యాం వద్ద వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాగి జావ తాగుతూ వారితో ముచ్చటించారు. నగరంలో పదేళ్లలో తాను చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో పదేళ్లలో రోడ్లు, హరితహారం, పారిశుధ్యం, మంచినీరు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. నాలుగో సారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయితే మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. పదేళ్లలో వేల కోట్ల నిధులు తీసుకువచ్చి వసతులను మెరుగుపర్చామన్నారు. ఐటీ టవర్‌తో పాటు కేబుల్ బ్రిడ్జి నిర్మించి కొత్త అందాలు తీసుకువచ్చామని తెలిపారు. అలాగే, ప్రభుత్వ మెడికల్ కళాశాలను జిల్లాకు తీసుకువచ్చామన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పూర్తయితే కరీంనగర్ ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా మారుతుందన్నారు. ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాదిలోగానే పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి పూర్తిగా నిలిచిపోతుందన్నారు. వారు ఏరోజు కూడా అభివృద్ధి విషయంలో ఆలోచన చేయరని పేర్కొన్నారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నాలుగున్నర ఏండ్లలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కేంద్రం వాటా నయా పైసా కూడా లేదన్నారు. డ్రామాలతో ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఓ రౌడీషీటర్‌కు టికెట్ ఇచ్చిందన్నారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఏ రోజు కూడా తెలంగాణ అభివృద్ధి విషయంలో పట్టించుకోలేదన్నారు. దీంతో తెలంగాణ ప్రజలు 50 ఏళ్లు సరైన సదుపాయాలు లేక అరిగోసపడ్డామని తెలిపారు. పదేళ్లల్లోనే దేశంలో అభివృద్ధిలో మొదటి స్థానంలోకి తెలంగాణ వచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలోనే హైదరాబాద్ తర్వాత రెండో నగరంగా కరీంనగర్‌ను తీర్చిదిద్దుతామన్నారు. మరోసారి తనకు అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు సుధాకర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ మహేశ్, నాయకులు ఏవీ రమణ, శ్రీనివాస్‌రెడ్డి, వాకర్స్ ప్రతినిధులు కనకాచారి, విద్యాసాగర్‌రెడ్డి, లింగయ్య, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం

- కడుపులో పెట్టుకుని కాపాడుకునే నాయకుడు కేసీఆర్
- బీఆర్ఎస్ జోష్‌కు ప్రతిపక్షాలు బేజారు
- కాంగ్రెస్‌ను నమ్మితే అరిగోస పడుతం
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గంగాధర మండలంలో ప్రచారం



బూరుగుపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్‌తో పార్టీ నాయకులు, కార్యకర్తలు

గంగాధర, నవంబర్ 23: తెలంగాణ ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకునేది సీఎం కేసీఆర్ మాత్రమేనని, ప్రజా సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరమల్యాల, ఒద్యారం, బూరుగుపల్లి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులను ఓటు అభ్యర్థించారు. స్థానిక మహిళలు, యువకులతో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే కర్ణాటక రాష్ట్ర రైతుల మాదిరిగా అరిగోస పడుతామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాత్రి సమయంలో పొలం కాడికి పోవడానికి రైతులు మళ్లీ టార్చిలైట్లు కొనుక్కోవాలన్నారు. రైతు బంధు వద్దని, వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ చాలని చెప్పే కాంగ్రెస్ పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఐదు గ్యారంటీలతో కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందన్నారు. తెలంగాణ ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకునే కేసీఆర్ కావాలా, అబద్ధపు హామీలతో సున్నం పెట్టే కాంగ్రెస్, బీజేపీ కావాలో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీది కుర్చీలాట అని, బీజేపీది మత రాజకీయమని, బీఆర్ఎస్‌ది ప్రజా సంక్షేమమని పేర్కొన్నారు. రైతు బీమా మాదిరిగా ప్రతి కుటుంబానికి మేలు చేసేలా ధీమా పథకంలో రూ.5 లక్షల బీమా వర్తించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 1800 కోట్లతో చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటను అర్హులైన వారికి గృహలక్ష్మి, బీసీ బంధును అందజేస్తామన్నారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, వెలిచాల తిర్మల్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసంకుల అనంతరావు, సర్పంచులు సాగి రమ్య, బొల్లాడి మంజుల–శ్రీనివాస్‌రెడ్డి, కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, ఎంపీటీసీలు దూలం లక్ష్మి–శంకర్‌గౌడ్, ముద్దం జమున–నగేశ్, అట్ల రాజిరెడ్డి, నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, కర్ర బాపురెడ్డి, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, రామిడి సురేందర్, అలువాల తిరుపతి, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 23: జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో పాఠశాల చైర్మన్ దాసరి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం ఉమ్మడి జిల్లా స్థాయిలో (కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల రాజన్న జిల్లా) ఇంటర్ స్కూల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో పోటీలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని హైస్కూల్ విద్యార్థులు (8, 9, 10వ తరగతి) అర్హులని పేర్కొన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున ఎన్ని గ్రూపులైన పంపించవచ్చని తెలిపారు. భగత్‌నగర్‌లోని సిద్ధార్థ పాఠశాలలో ఈనెల 26న ఉదయం 9 గంటలకు ప్రిలిమినరీ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన 8 గ్రూపులను ఎంపిక చేసి డిసెంబర్ 2న ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.7,001, ద్వితీయ బహుమతి రూ. 5,001, తృతీయ బహుమతి రూ.3,001 ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 92905 69083 లో సంప్రదించాలని సూచించారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీపాల్ రెడ్డి, తదితరులు



మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్‌అలీ, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

- కాంగ్రెస్ పాలనలో ముస్లింలు ఓట్లకే పరిమితమయ్యారు
- సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- హోంమంత్రి మహమూద్‌అలీ
- గంగాధర మండలం బూరుగుపల్లిలో మైనార్టీలతో సమావేశం

గంగాధర, నవంబర్ 23: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. మండలంలోని బూరుగుపల్లిలో గురువారం చొప్పదండి నియోజకవర్గంలోని ముస్లింలతో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో ముస్లింలు ఓటు వేయడానికి మాత్రమే పరిమితమయ్యారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ రంజాన్ తోఫా, షాదీ ముబారక్, మైనార్టీ బంధు వంటి పథకాలను తీసుకువచ్చి ముస్లింలు ఆత్మగౌరవంతో బతకడానికి తోడ్పాటునందిస్తున్నారని కొనియాడారు. మసీదుల్లో పని చేసే ఇమాంలకు గౌరవ వేతనం రూ. 6 వేలు ఇస్తున్నారని, అధికారంలోకి రాగానే రూ.10 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. మైనార్టీ పిల్లలకు నాణ్యమైన విద్యనందించడానికి మైనారిటీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి రూ.2008 కోట్లు ఖర్చు చేశారని, ముస్లిం విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి రూ.1400 కోట్లు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ముస్లింల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనను తిరిగి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అక్బరుద్దీన్, జడ్పీ కో–ఆప్షన్ సభ్యులు శుక్రుద్దీన్, సుబాన్, జమీల్, సర్పంచ్ ఎండీ నజీర్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అబ్బాస్, ఆరు మండలాల ముస్లింలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నియోజకవర్గంలోని ముస్లింలు

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు



తోడేటి శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి (రామడుగు), నవంబర్ 23: రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ మాజీ మండలాధ్యక్షుడు తోడేటి శ్రీనివాస్ గురువారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వం, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేస్తున్న అబివృద్ధికి ఆకర్షితుడినై బీఆర్ఎస్‌లో చేరినట్లు తోడేటి శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.